సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9652278546

నంబర్‌ను సంప్రదించండి

- రైతు నెత్తిన పంటల బీమా భారం
- రైతులే ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వ నిర్ణయం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- పెట్టుబడి సాయం, బీమా ధీమా లేక రైతుల అవస్థలు
- ఎన్నికల నాటి హామీలను అమలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి



రాయపుర అగ్రహారంలో యంత్రాల సాయంతో వరి నూర్పులు





వంగలిలో ముమ్మరంగా వరిచేను కోతలు

పంటల బీమా.. రైతుకేదీ ధీమా

పంటల బీమా పథకం అమల్లో కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తోంది. ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేసి అన్నదాత నడ్డి విరుస్తోంది. పండిస్తున్న పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం చేసిన ప్రకటనతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల హామీ పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టి, ఇప్పుడు పంటల బీమా భారం వేయడమేంటని వాపోతున్నారు.

సబ్బవరం:

ఎన్నికల సమయంలో అన్నదాతలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కేస్తోంది. ఏటా అన్నదాత సుఖీభవ పేరిట ఇస్తాన్న రూ.20 వేల ఆర్థిక సాయం అతీగతీ లేదు. ఖరీఫ్ పంట చేతికొచ్చేసినా పెట్టుబడి సాయం ఊసెత్తట్లేదు. ఇప్పుడు రబీ సీజన్ పంటలకు బీమా ప్రీమియంను రైతులే చెల్లించాల్సి రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్బవరం మండలంలోని సుమారు 6,200 మంది రైతులు ప్రభుత్వ తీరును ఆక్షేపిస్తున్నారు. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో బీమా ధీమా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా ప్రతి రైతుకు రూ.13,500 పెట్టుబడి సాయం ఖరీఫ్ సాగునాటికే అందేది. దీంతో పాటు పంటల బీమా ప్రీమియం కూడా రైతుల తరపున ప్రభుత్వమే చెల్లించేది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంట నష్టపోయినా రైతుల్లో ఆందోళన ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలు దాటినా తమకు ఏ రూపంలోనూ ప్రభుత్వ ద్వారా మేలు చేకూరలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ సీజన్ మొదలైంది. ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందలేదు. ఇప్పుడు రబీ పంటల బీమా ప్రీమియం గడువు కూడా వరి మినహా.. మిగిలిన వాటికి ఈ నెల 15తో ముగిసింది. ప్రీమియం రైతులే చెల్లించాలనడంతో ఆశించనంతగా బీమా ప్రక్రియ జరగలేదు.

భరోసానివ్వని ప్రభుత్వం

సబ్బవరం మండలంలో 6,200 మంది రైతులు 9,100 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. వీరికి కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం దక్కలేదు. ఇలా అయితే సాగు కష్టమేనని వాపోతున్నారు. ప్రభుత్వ భరోసా లేకపోవడంతో ఖరీఫ్ సీజన్ అప్పులతోనే నడిచిందని, ఇప్పుడు రబీ సీజన్లో ఆ భారం భరించేలమని చెప్తున్నారు. దీనికి తోడు ఇటీవల తుపాను ప్రభావంతో వరి పంటను కొంత మేర నష్టపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. పంటల బీమా లేకపోవడంతో నష్టపోయిన పంటకు పరిహారం పొందే అవకాశం లేకుండా పోయిందని లబోదిబోమంటున్నారు.

ఇప్పటికే పెట్టుబడి సాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, బీమా ప్రీమియం ఎలా చెల్లించాలని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

గడువు పొడిగించేనా?

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)లో ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. వరి పంటకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ నెలాఖరు(డిసెంబర్ 31) వరకు గడువిచ్చారు. పెసర, మినప, మొక్క జొన్న వంటి చిరు ధాన్యాలు, వాణిజ్యం పంటలకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల 15తోనే ముగిసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించేందుకు ముందుకొస్తుందన్న నమ్మకంతో వెనుకడుగేసిన రైతులు, ఇప్పుడు గడువు పెంచాలని కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. దీంతో రైతులకు మళ్లీ చీకటి రోజులు దాపురించినట్లేనని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యంత్రాల సాయంతో వరి నూర్పులు

రైతులు చెల్లించాల్సిన ప్రీమియం

పంట రకం	ప్రీమియం (ఎకరాకు) రూ.లలో	పరిహారం రూ.లలో
వరి	630	42,000
శనగ	486	28,000
వేరుశనగ	486	32,000
జొన్న	319	19,800
పెసలు	300	20,000
మినుములు	300	20,000

మండలంలో రైతులు **6,200** మంది

పంటల సాగు విస్తీర్ణం **9,100** ఎకరాలు

బీమా భారం సీజన్‌కు దాదాపు రూ.**40** లక్షలు

అప్పులు చేసి వ్యవసాయం



రైతులను ఆదుకునేందుకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి పెట్టుబడి సాయం తక్షణమే ఇవ్వాలి. బీమా ప్రీయం ప్రభుత్వమే చెల్లించాలి. రైతులంతా అప్పులు చేసి మరీ పంటలు సాగు చేస్తున్నాం. సాగు సాయం డబ్బులు ఎప్పుడు జమచేస్తారోనని ఆశగా ఎదురు చూస్తున్నాం.

– పిల్లల స్వామినాయుడు, రాయపుర అగ్రహారం

అన్నదాతల్ని ఆదుకోండి



రబీ సీజన్ పంటలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించాలి. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా అన్నదాతలను ఆదుకోకపోతే ఎలా? ఇప్పటికైనా రైతుల్ని ఆదుకునే ప్రయత్నిం చేయాలి. పెట్టుబడి సాయం, బీమా ప్రీమియంతో రైతులకు భరోసానివ్వాలి.

– బోకం శ్రీనివాసరావు, తవ్వవానిపాలెం

వరికి నెలాఖరే గడువు



మినుములు, పెసర, జీడి మామిడి, టమాటా వంటి చిరుధాన్యాలు, కాయగూరలు, ఉద్యాన పంటలకు సైతం ఈ నెల 15తో బీమా ప్రీమియం చెల్లించేందుకు గడువు ముగిసింది. వరికి ఈ నెలాఖరు వరకు ప్రీమియం చెల్లించేందుకు సమయం ఇచ్చారు. రబీ నుంచి పంటల బీమాను రైతులే చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి.

– పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి, సబ్బవరం మండలం

క్లుప్తంగా

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



పెందుర్తి: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్టి జరిపారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాలు ముగిసే వరకు భక్తుల కోసం కొండ దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం ఉంటుందని ఈవో వెల్లడించారు.

అప్పన్న సన్నిధిలో పుదుచ్చేరి స్పీకర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఆర్.సెల్వం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ ఆర్.సెల్వం మంగళవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంను ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

'రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ చేయాలి'



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న ఐడీ బాబు తదితరులు

సబ్బవరం: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర యూనిట్‌గా మాదిగ, దాని ఉపకులాలకు న్యాయం జరిగేలా ఏబీసీడీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ ఐడీ బాబు కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వర్గీకరణ అమలు కోసం మంగళవారం ఏర్పాటు చేసిన ఏకసభ్య చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసి వినతి పత్రం అందించారు. డప్పు, చర్మ కళాకారులు, మాదిగ ఉప కులాలకు చెందిన చేతి వృత్తిదారులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పింకి సుధాకర్, గొటివాడ సుభాషిణి, తలాల నాగరాజు, లక్ష్మణరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'పెన్షన్ ప్రభుత్వ భిక్ష కాదు.. గౌరవం'



సూపర్ సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న మండల యూనిట్ కార్యవర్గ సభ్యులు

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మండల యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రం సబ్బవరంలో పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నలుగురు సూపర్ సీనియర్ పెన్షనర్లను మళ్ల శ్రీరాములునాయుడు, ధనిమిరెడ్డి అప్పలస్వామి, ఎ.మహాలక్ష్మి, రొంగలి రాములను ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు పీవీఆర్ పట్నాయక్, కార్యదర్శి బి.నరసింగరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. పెన్షన్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వారిచ్చే భిక్ష కాదని, సుదీర్ఘ కాలం అందించిన సేవలకు దక్కాల్సిన గౌరవమన్నారు. కార్యక్రమంలో యూనిట్ మండల కన్వీనర్ బి.సత్యనారాయణ, ట్రెజరర్ కామిరెడ్డి దేముడుతో పాటు సుమారు 80 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

విశేషంగా పునర్వసు నక్షత్ర హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో మంగళవారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న హోమగుండం వద్ద సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా జరిపారు. సంక్షిప్త రామాయణ పారాయణం చేశారు. భక్తులకు యజ్ఞ ప్రసాదాన్ని అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యూటీఎఫ్ టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ



టెన్త్‌మోడల్ పేపర్లను అవిష్కరిస్తున్న ఎంఈవో లక్ష్మణరావు, యూటీఎఫ్ ప్రతినిధులు

సబ్బవరం: పదోతరగతి విద్యార్థుల సౌకర్యార్థం మారిన సిలబస్ మేరకు యూటీఎఫ్ రూపొందించిన పబ్లిక్ పరీక్షల మోడల్ పేపర్ల పుస్తకాన్ని సబ్బవరం మండల విద్యాశాఖాధికారి ఎస్.లక్ష్మణరావు మంగళవారం అవిష్కరించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ గౌరవ అధ్యక్షుడు పి.తమ్మారావు మట్లాడుతూ యూటీఎఫ్ అకడమిక్ సెల్ ఆధ్వర్యంలో నిపుణులైన అధ్యాపకులచే తయారు చేసిన ఈ మోడల్ పేపర్స్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. గత సంవత్సరం టెన్త్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు తమ మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఈ మోడల్ పేపర్స్ పుస్తకాన్ని రూ.75కే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బి.నాగరాజు, పలువురు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చి'వరి' ఆందోళన



పొలంలో ఆరబెట్టిన వరిచేను

పెందుర్తి: నియోజకవర్గంలో వరి చేను కోతలు ఆఖరి దశకు చేరుకున్న తరుణంలో అన్నదాతలను వాతావరణం ఆందోళనకు గురి చేస్తోంది. ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో భయపెట్టిన వాతావరణం.. ఇప్పుడు అధిక వర్షాలతో కలవరం పెంచుతోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు మబ్బులు పట్టిన వాతావరణం ,సాయంత్రానికి పూర్తిగా ప్రతికూలంగా మారడంతో రైతులు పొలాల్లో పరుగులు తీశారు. పంటను కాపాడుకునేందుకు, అప్పటికప్పుడే కోసిన చేనును కల్లాలకు తరలించేందుకు ఆపసోపాలు పడ్డారు. కూలీలు దొరికే పరిస్థితి లేకపోవడంతో ఎవరికి వారే తిప్పలు పడాల్సి వచ్చింది. ఇప్పటికే పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో 60–70 శాతం వరికోతలు పూర్తి కాగా మిగిలిన చేను పొలాల్లో ఉంది. ఆఖరి దశ వరి కోతలు జరుగుతున్న సమయంలో రానున్న రెండు మూడు రోజుల్లో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ గండం గట్టెక్కాలని భగవంతుని కోరుకుంటున్నారు.

నేడు గుర్రంపాలెంలో రెవెన్యూ సదస్సు

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలో భూములున్న రైతులు రెవెన్యూ పరమైన, ఇతరత్రా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



డి.సూరిబాబు, పెందుర్తి క్రైం ఎస్‌ఐ

పెందుర్తి: నేరాల నియంత్రణకు ప్రజల సహకారం పోలీసులకు ఎంతో అవసరమని పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు అన్నారు. పెందుర్తి ప్రాంతంలో జరుగుతున్న నేరాల నియంత్రణకు పూర్తి స్థాయిలో గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దొంగతనాలు రాత్రీ పగలు అనే తేడా లేకుండా జరుగుతున్నందున విలువైన వస్తువులు లాకర్‌లో భద్రపరుచుకోవాలని ప్రజలకు సూచించారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలు ఒంటిపై ధరించే నగలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. ప్రజలు ఇళ్లను వదిలి ఊరు వెళ్లినపుడు ఇంటి చిరునామాను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాల్సిందిగా సూచించారు. అపరిచిత వ్యక్తుల సమాచారం కోసం 1090, 100, క్రైం సీఐ: 94409 04717, క్రైం ఎస్‌ఐ: 83310 41618, పోలీస్ స్టేషన్: 0891–2764233 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పారిశ్రామిక ప్రమాదాల నియంత్రణలో పోలీసులు కీలకం

- పోలీసులకు మూడు రోజుల పాటు ఫైర్ సేఫ్టీలో శిక్షణ
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా



ఎస్పీ తుహిన్ సిన్హాకు జ్ఞాపిక అందిస్తున్న లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.రావు

పరవాడ: పరిశ్రమల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాల పట్ల పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఫార్మాసిటీలో ఎంఎఎస్ఎం సమావేశ మందిరంలో జిల్లా పోలీసులకు ఫైర్ సేఫ్టీపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. అత్యవసర సమయాల్లో అగ్నిప్రమాదాల నుంచి ప్రాణాలను రక్షించే శిక్షణలో పోలీసులు ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ప్రమాదాలు సంభవించే సమయంలో ప్రజలు పోలీసులనే ఆశ్రయిస్తారని అందువల్ల పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాల నివారణపై పోలీసులు కూడా ప్రత్యేక శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సరైన శిక్షణ లేకపోతే ఇతరులను రక్షించలేకపోవడమే కాకుండా తమ ప్రాణాలకూ ముప్పు కలుగుతుందన్నారు. అందుకే ఫైర్ సేఫ్టీపై పోలీసు యంత్రాంగం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఫార్మా పరిశ్రమల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాల నియంత్రణలో పోలీసుల సహకారం ఎంతైనా అవసరమన్నారు. పరిశ్రమల్లో గ్యాస్ లీకేజీ, బాయిలర్ పేలుళ్లు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నందున వాటికి తగ్గ నియంత్రణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఏ విధంగా పనిచేస్తుందో.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లారస్ ల్యాబ్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్(సేఫ్టీ) శ్రీనివాస్ అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో అనకాపల్లి సబ్‌డివిజన్, నర్సీపట్నం, పరవాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా ఆర్మ్‌డ్, రిజర్వ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులను ఈ నెల 19న హెచ్‌పీసీఎల్ రిఫైనరీ సందర్శనకు తీసుకువెళ్లి, అక్కడ అధునాతన అగ్నిమాపక పరికరాలు, అగ్నిమాపక విన్యాసాలపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, పరవాడ, సబ్బవరం సీఐలు ఆర్.మల్లికార్జునరావు, పి.వి.రమణ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ శారదకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మహిళా సంఘం ప్రతినిధులు

పెందుర్తి: మహిళల సమస్యలపై నిరంతర పోరాటం చేసి, ఎన్నో విజయాలు సాధించిన కామ్రేడ్ శారద కార్మిక లోకానికి మార్గదర్శకురాలని మహిళా సంఘం నాయకురాలు బి.రమణి అన్నారు. 96వ వార్డులోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం కామ్రేడ్ డి.శారద 20వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి శారద ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ల సంఘం ప్రతినిధి దేవి, సీఐటీయూ, ఇతర మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'రెవెన్యూ' అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ సన్యాసినాయుడు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలు తమ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. రావాడ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఏ చిన్నపాటి సమస్యలున్నా రెవెన్యూ సదస్సు ద్వారా తమకు నివేదించి, వాటిని పరిష్కరించుకోవాలని కోరారు. భూ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు మాట్లాడుతూ రావాడ రెవెన్యూ పరిధి సర్వే నెం.404లోని ఫారెస్టు ఆధీనంలోని 183 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసి, హద్దులు నిర్ణయించాల్సిందిగా కోరారు. సర్వే నెం.170లోని వినోభాబావేకు చెందిన భూమిని సర్వే జరిపి పంచాయతీకి అప్పగించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సదస్సులో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 310 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మాజీ ఎంపీటీసీ జోగినాయుడు, డీటీ సురేష్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి కోతలు వద్దు



పెందుర్తి: అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో పెందుర్తి ప్రాంతంలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో వరి చేను కోతలను నిలుపుదల చేయాలని మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో రైతుల్ని హెచ్చరించారు. వర్షాల ప్రభావం తగ్గేవరకు కోతలు ఆపాలన్నారు. ముందుగానే అల్పపీడనం, వాయుగుండంపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పినప్పటికీ కొందరు కోతలు చేపట్టినట్లు తెలిపారు. ఇలాంటి వారు వెంటనే పంట చేలను పొలాల్లో చిన్న చిన్న కుప్పలుగా వేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ ప్రభావం తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు.